సాక్షి సంగారెడ్డి

మంగళవారం । 19 । నవంబర్ । 2024



చలి కాలం.. పౌల్ట్రీ పదిలం

పౌల్ట్రీ రంగానికి చలికాలంలో సహజంగా ఇబ్బందులెదురవుతాయి. సమస్యల నివారణకు వైద్యులు సలహాలు సూచనలు అందిస్తున్నారు. వివరాలు 8లో ▸



శనగ వైపు.. రైతుల చూపు

రైతులు యాసంగిలో శనగ పంట సాగు వైపు మొగ్గు చూపుతున్నారు.

వివరాలు 9లో ▸



విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా అదనపు కలెక్టర్ మాధురి అన్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో



విద్యార్థులకు టై, బెల్ట్‌లను అందజేస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): నిజాంపూర్(కే) ప్రభుత్వ పాఠశాలను ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ అద్భుతంగా తీర్చి దిద్దుతున్నారని జిల్లా విద్యాధికారి (డీఈవో) వెంకటేశ్వర్లు ప్రశంసించారు. మండల పరిధిలోని నిజాంపూర్(కే) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయులు తయారుచేసిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి పాఠశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు టై, బెల్ట్‌లను అందజేశారు. పెద్దాపూర్, నిజాంపూర్, కొనాపూర్ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రిన్స్ పైప్స్ సహకారంతో మహితా ఫౌండేషన్ నిర్మించిన మరుగుదొడ్లు, మూత్రశాలలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...విద్యాభివృద్ధికి ప్రభుత్వం కేటాయిస్తున్న నిధుల్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు పాఠశాలలో మౌలిక వసతులను కల్పించిన మహితా ఫౌండేషన్, ప్రిన్స్ పైప్స్ ప్లాంట్ యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శంకర్, ప్రిన్స్ పైప్స్ ప్లాంట్ హెడ్ రాజశేఖర్, మహితా స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘బాల వైజ్ఞానిక ప్రదర్శనను జయప్రదం చేయాలి’

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఈనెల 21,22,23వ తేదీల్లో జరగనున్న జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన, జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ అవార్డుల ప్రదర్శనను జయప్రదం చేయాలని జిల్లా విద్యాధికారి (డీఈవో) వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోని ఉన్నత పాఠశాలలో అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైజ్ఞానిక ప్రదర్శనకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ...ఈ ఏడాది వైజ్ఞానిక ప్రదర్శనకు సంబంధించి 11 కమిటీలను నియమించామన్నారు. ప్రారంభోత్సవం రోజు రిజిస్ట్రేషన్ కార్యక్రమం ఉదయం 7:30 నుంచి ప్రారంభం అవుతుందని విద్యార్థులు సబ్ థీమ్స్ వారీగా కౌంటర్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

విద్యార్థులకు సీజీఆర్ చైర్మన్ రవాణా సౌకర్యం



రవాణా సౌకర్యాన్ని ప్రారంభిస్తున్న గోవర్ధన్ రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని మంబాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు రవాణా సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు కాలినడకనే వస్తున్న విషయం తెలుసుకున్న సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి వెంటనే వారికి రవాణా సౌకర్యం కల్పించారు. గోవర్ధన్ రెడ్డి తన సొంత నిధులతో రెండు ఆటోలను అందజేశారు. స్థానిక నాయకులతో కలసి గోవర్ధన్‌రెడ్డి సోమవారం ఆటోలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...బడికి వచ్చేందుకు విద్యార్థులు నాలుగు కిలోమీటర్లు మేర నడుచుకుంటూ వస్తున్నారని ఇటీవలే గ్రామస్తులు తన దృష్టికి తెచ్చారన్నారు. వారికి చదువు భారం కాకుడదనే ఉద్దేశంతో రవాణా సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. పేదలకు తనవంతు సహాయ సహకారాలు అందజేస్తానని హామీనిచ్చారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



వ్యాస రచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు పాఠశాలస్థాయి విద్యార్థులకు ‘యువతపై సామాజిక మాధ్యమం (సోషల్ మీడియా) ప్రభావం’అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు.

‘ఉపాధి’లో కొత్త పనులు

67,07,312 పని దినాల లక్ష్యం

- రూ.335.36 కోట్ల మేర బడ్జెట్ కేటాయింపు
- వ్యవసాయ అనుసంధాన పనులకు నిర్ణయం
- కూలీలకు గిట్టుబాటు అయ్యే పనుల గుర్తింపు
- చెరువుల్లో పూడికతీత వంటి పనులు తొలగింపు



ఉపాధిలో పనులు చేస్తున్న కూలీలు

సంగారెడ్డి జోన్: గ్రామాలలో వలసలు నివారించేందుకు గత కొన్నేళ్ల క్రితం కేంద్రప్రభుత్వం మహాత్మా గాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకంను మరింతగా విస్తరిస్తూ నూతన పనులకు శ్రీకారం చుట్టింది. ఒక ఏడాదిలో గుర్తించిన పనులను కొన్నేళ్లపాటు కొనసాగిస్తూ బిల్లులు చేస్తున్నట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో మరింత పక్కాగా ఉపాధి హామీ పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. ఏ సంవత్సరంలో పనులు గుర్తిస్తారో అదే ఏడాదిలో ఆ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది.

67,07,312 పని దినాలు

జిల్లాలో 2025–26ఆర్థిక సంవత్సరంలో 67,07,312 పని దినాలను కూలీలకు కల్పించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. అదేవిధంగా 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.335.36కోట్ల మేర బడ్జెట్‌ను కేటాయించారు. గత ఆర్థిక ఏడాదిలో కూలీల కోసం రూ.136.30 కోట్లు ఖర్చు చేసినట్లు సంబంధిత శాఖ అధికారులు వెల్లడించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీలో పనులు చేపట్టేందుకు ప్రత్యేకంగా గ్రామాలవారీగా సభలు నిర్వహించి కూలీలకు గిట్టుబాటు అయ్యే విధంగా పనులను గుర్తిస్తున్నారు. ఉపాధి హామీలో పనులను విస్తరిస్తూ ఈసారి కొత్తగా ఐదు రకాల పనులను అమలు చేయనున్నారు. ఇప్పటికే కొనసాగుతున్న పనులలో కొన్నింటిని తొలగించి వాటి స్థానంలో కొత్త పనులను చేర్చనున్నారు. ఇందులో భాగంగా ఉపాధి హామీని వ్యవసాయ రంగానికి అనుసంధానం ఉండే పనులు చేపట్టనున్నారు.

చెరువులో పూడికతీత పనులు తొలగింపు

ఉపాధిహామీ పథకంలో భాగంగా ప్రతీ ఏటా చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టేవారు. మట్టిని తొలగించేవారు. వర్షాకాలంలో కురిసిన వర్షాలకు నీటితో నిండిపోవడంతో కొలతలు చేపట్టడానికి వీలు లేకుండా పోయేది. ఈ క్రమంలో పనులు చేపట్టకపోయినా పనులు చేసినట్లు రికార్డులు చేసి బిల్లులు స్వాహా చేసినట్లు, తక్కువ పనులు చేసి ఎక్కువగా నమోదు చేయడం వంటి ఘటనలు ఉన్నాయి. వీటికి చెక్ పెట్టేందుకు తాజాగా చెరువుల్లో పూడికతీత పనులను నిలిపివేసేందుకు నిర్ణయించారు.

కొత్తగా చేర్చిన పనులివీ

మహిళా శక్తి–ఉపాధి భరోసా

ఇందులోభాగంగా రైతులకు మేలు కలిగించే పనులు ఉంటాయి. పశువుల కొట్టాల నిర్మాణం, పశువులకు వినియోగించే గడ్డి పెంపకం, వర్మీ, నాడెపు కంపోస్ట్ నిర్మాణం, పౌల్ట్రీ షెడ్ల నిర్మాణం (1000 కోడి పిల్లలు), ఎస్సీ,ఎస్టీలతోపాటు పోడు భూముల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నారు.

పొలంబాట

- వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు మట్టిరోడ్ల నిర్మాణం చేపడతారు.
- మొక్కలు పెంపకం–నర్సరీల నిర్వహణ
- ఈత, తాటి మొక్కల పెంపకం, మార్చి 2026 వరకు 9 కోట్ల మొక్కల పెంపకం, మొక్కల నిర్వహణ, డ్రిప్ పరికరాలతో పండ్ల తోటల పెంపకం.

జలనిధి

- వృథాగాపోయే నీటిని అరికట్టడం, చెక్‌డ్యామ్‌లు, పార్కులేషన్ ట్యాంకులు, ఫారం పాండ్స్ నిర్మాణం, రైతులకు బావుల మరమ్మతు, కొత్త బావుల్ని తవ్వకం వంటి పనులు చేపట్టడం.

గ్రామీణ పారిశుద్ధ్యం

- పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ఇంకుడు గుంతల నిర్మాణం.

గ్రామాలలో మౌలిక వసతులు కల్పన

- బాలికల ప్రభుత్వ పాఠశాలలో టాయిలెట్ల నిర్మాణం, గ్రామాలలో సీసీ రహదారుల నిర్మాణం, గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనులు చేపట్టడం.

అందరి అభిప్రాయంతోనే..



ఉపాధి హామీ పథకంలో వచ్చే ఆర్థిక సంవత్సరంలో పనులు చేపట్టేందుకు గ్రామ సభల ద్వారా పనులను గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. ప్రజలు, రైతులు, ఉపాధి కూలీల అభిప్రాయం మేరకు, కూలీలకు గిట్టుబాటు అయ్యే పనులను గుర్తించి, పనులు చేపడతాం. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా సొంత గ్రామాల్లో పనులు కల్పించేందుకు ఉపాధి హామీ పథకం తీసుకొచ్చారు. దీనిని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి.

-జ్యోతి, డీఆర్‌డీవో, సంగారెడ్డి జిల్లా

జిల్లాలో ఉపాధి హామీ వివరాలు	
జాబ్ కార్డులు	2,19,000
ఉపాధి కూలీలు	4,02,000
పనులకు హాజరవుతున్నవారు	2,24,000

‘మల్బరీ’పై మళ్లీ ఆశలు

రామాయంపేటలో విత్తన కేంద్రం పునరుద్ధణకు ప్రతిపాదనలు

- రైతుల్లో హర్షం
- గతంలో మూతపడిన పరిశ్రమ



రామాయంపేటలో మూతపడ్డ పట్టు విత్తన క్షేత్రం

రామాయంపేట(మెదక్): జిల్లాలోని రామాయంపేట, కుల్చారం మండలం ఘణపూర్ వద్ద రెండు పట్టు(మల్బరీ) విత్తన కేంద్రాలున్నాయి. ఒకటైన రామాయంపేట విత్తన కేంద్రం మూత పడగా దాన్ని పునరుద్ధరించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. సుమారుగా 40 ఏళ్ల క్రితం మెదక్ ఉమ్మడి జిల్లాలో మొదటిసారిగా రామాయంపేటలో పట్టువిత్తన కేంద్రం ఏర్పాటైంది. జాతీయ రహదారిని ఆనుకునే పది ఎకరాల విస్తీర్ణంలో ఉంది. జిల్లాలోని వివిధ మండలాలకు ఇక్కడి నుంచే పట్టు విత్తనాలు, మొక్కలు సరఫరా అయ్యేవి. జిల్లాలోని రైతుల.. క్షేత్ర పర్యటనలు, అధికారుల తనిఖీలు, పట్టు పురుగులు, విత్తనాల సరఫరాతో ఉమ్మడి జిల్లాలో ఈ కేంద్రం గుర్తింపు పొందింది. గతంలో జిల్లాలో చాలా మంది రైతులు వందలాది ఎకరాల్లో పట్టు సాగు చేసేవారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏ మండలానికి అవవసరమైనా ఇక్కడి నుంచే పట్టు పురుగులు, విత్తనాలు సరఫరా చేసేవారు. ఇక్కడ నెలల తరబడి రైతులకు ఇక్కడ శిక్షణ ఇచ్చేవారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. విత్తన క్షేత్రం మూత పడటంతో పట్టు సాగు చేసిన రైతులు నష్టానికి గురయ్యారు. మల్బరీ శాఖలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉండగా, కొన్నాళ్లు రామాయంపేట కేంద్రాన్ని అటెండర్‌తో కొనసాగించారు. తర్వాత ఇదీ మూతపడింది. దీంతో రైతులు ఇతర పంటల సాగు వైపు మళ్లారు.

కేంద్రం పునరుద్ధరణకు కృషి



రామాయంపేటలో మూతపడ్డ పట్టు విత్తన క్షేత్రం పునరుద్ధరణ కోసం కృషి చేస్తున్నాం. ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. విత్తన క్షేత్రం లేకపోయినా సాగు చేస్తున్న రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రతాప్‌సింగ్, జిల్లా హార్టికల్చర్ అధికారి

క్వింటాలుకు 5 కిలోలు బొక్కేస్తుండ్రు

నార్సింగి పీఏసీఎస్‌లో సిబ్బంది చేతివాటం

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్ల తూకం వేసే విషయమై సిబ్బంది చేతివాటం చూపుతున్నారు. ఇదేమని రైతులు ప్రశ్నిస్తే కాంటా వేయకుండా ఇబ్బందులు పెడుతున్నారు. సోమవారం పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో సన్న రకం వడ్ల బస్తా 43 కిలోల 300 గ్రాములు కాంటా చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు 41.300 గ్రాములు కాంటా వేయాల్సి ఉంది. కానీ నార్సింగి పీఏసీఎస్ సిబ్బంది రైతులకు నష్టం కలిగించేలా తూకం వేస్తున్నారు. 40 కిలోల బస్తాకు 2 కిలోలు ఎక్కువగా కంటా వేస్తున్నారని, క్వింటాకు 5 కిలోలు ఎక్కువగా కాంటా చేస్తున్నారని రైతులు వాపోతున్నారు.



ధాన్యం తూకం వేస్తున్న కూలీలు

వెచ్చని నేస్తాలు.. ఉన్ని దుస్తులు

చలి తీవ్రతతో పెరిగిన వ్యాపారం

- రాజస్థాన్, మధ్యప్రదేశ్ ప్రాంతవాసుల విక్రయాలు



జోగిపేటలో ఉన్ని దుస్తులను కొనుగోలు చేస్తున్న స్థానికులు

జోగిపేట(అందోల్): రోజు రోజుకు చలిపెరిగిపోతోంది. చలిబారిన పడకుండా శరీరాన్ని, ఆరోగ్యాన్ని రక్షించుకునేందుకు వెచ్చని ఉన్ని దుస్తులు ధరించడం పరిపాటి. ఇక నిద్రపోయేటప్పుడు రగ్గులు కూడా చలి నుంచి మంచి రక్షణనిస్తాయి. శీతాకాలం వచ్చిందంటే చాలు చలికి రక్షణ ఉండే ఉన్ని దుస్తుల దుకాణాలు రోడ్డుపక్కన దర్శనమిస్తుంటాయి. ఇదిగో ఇప్పుడు జిల్లాలో అదే పరిస్థితి...మెల్లగా చలిపెరుగుతోంది. రోడ్డు పక్కన అక్కడక్కడా ఉన్ని వస్త్ర దుకాణాలు వెలుస్తున్నాయి. ఇతర రాష్ట్రాలనుంచి వచ్చి ఈ శీతాకాలం అంతా ఇక్కడ ఉన్ని వస్త్రాలు అమ్ముకుని వెళ్తారు. ప్రజలు కూడా చలిని తట్టుకునేందుకు రగ్గులు, స్వెట్టర్లు, మఫ్లర్‌లు, శాలువాలు, మంకీ క్యాప్‌లు కొనుగోలు చేస్తుంటారు. ఇక్కడి ప్రజల అవసరాలను గుర్తించి రాజస్థాన్, మధ్యప్రదేశ్ వాసులు ఉమ్మడి జిల్లాల పరిధిలోని పట్టణాల్లో రోడ్డుకిరువైపులా షెడ్లు వేసి ప్రత్యేకంగా దుకాణాలు ఏర్పాటు చేసుకుని విక్రయాలు జరుపుతున్నారు. రెడీమేడ్, షాపింగ్‌మాల్‌లో స్వెటర్లు లభిస్తున్నా పేద, మధ్య తరగతికి చెందిన ప్రజలు రోడ్డు ప్రక్కన ఏర్పాటు చేసిన షాపుల్లోనే కొనుగోలు చేస్తారు.

నాణ్యత, సైజ్‌ను బట్టి ధరలు

చలితోపాటు వర్షానికి కూడా తట్టుకునేలా, చిన్నారులు, యువత, మహిళలను ఆకట్టుకునేలా అనేక రంగుల ఉన్ని దుస్తుల్ని ఈ దుకాణాల్లో అమ్ముతున్నారు. స్వెట్టర్లు, జర్కిన్లు, శాలువాలు, మంకీ టోపీలు, రగ్గులు, ఇయర్ బ్యాండ్స్ ఇలా అనేక రకాలైన ఉన్ని దుస్తుల్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. చిన్నారులను ఆకర్షించేలా చోటాభీమ్, లిటిల్ సింగం వంటి జంతువుల బొమ్మలతో కూడిన స్వెట్టర్లను కూడా దుకాణాల్లో విక్రయిస్తున్నారు. వీటి ధరలు నాణ్యత, సైజ్‌ను బట్టి ధరలు ఉంటాయి. నేపాల్, పంజాబ్, టిబెట్, తదితర ప్రాంతాల నుంచి తెప్పించిన ఈ స్వెటర్లకు డిమాండ్ బాగా ఉంటోంది. రూ.200 నుంచి రూ.2వేల వరకు విక్రయిస్తున్నారు.

ధరలు	
స్వెటర్లు:	రూ. 600 నుంచి 1,500
రెయిన్ కోట్లు:	రూ.1,000 నుంచి 1,500
శాలువాలు:	రూ.400 నుంచి రూ.600
మంకీ క్యాప్‌లు:	రూ.80 నుంచి 150
మఫ్లర్:	రూ.50 నుంచి 200
బెడ్‌షీట్లు (రగ్గులు):	సింగల్ రూ.600
గ్లౌజులు:	రూ.100 నుంచి 200

ఎక్కువ రోజులు ఉండాలంటే...



ఉన్ని దుస్తులు ఎక్కువ కాలం ఉండాలంటే ఉతికేటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటించాలి. వాషింగ్ మెషీన్‌లో వేయకూడదు. రెండు రోజులకోసారి ఉతకడం మేలు. మరకలు పడ్డప్పుడు డ్రైక్లీనింగ్ చేయించుకోవాలి. ఉన్ని వస్త్రాలను తీగలపై ఆరేయకూడదు. అలా చేస్తే అవి సాగిపోయే అవకాశం ఉంది. ఎక్కువ ఎండ తగలకుండా చూడాలి.

కరణ్‌సింగ్, విక్రయదారుడు (మధ్యప్రదేశ్)

గెలిపించే బాధ్యత మాదే

కార్యకర్తలు నారాజ్ కావద్దు

- త్వరలోనే బీఆర్‌ఎస్ పార్టీ ఖాళీ
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



మాట్లాడుతున్న మహేశ్‌గౌడ్, చిత్రంలో మంత్రి దామోదర, జగ్గారెడ్డి తదితరులు

కొండాపూర్(సంగారెడ్డి): కార్యకర్తల శ్రమ, కృషి, పట్టుదలతో శాసనసభ ఎన్నికల్లో గెలిచి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారని, కాంగ్రెస్ కార్యకర్తలు నారాజ్ కావద్దని మిమ్మల్ని కూడా గెలిపించాల్సిన బాధ్యత మాపై ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. కొండాపూర్ మండల పరిధిలోని మల్కాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ...మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని ఇస్తే గత పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం నేడు అప్పుల కుప్పగా మార్చిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో రూ.వేల కోట్లను దోపిడీ చేశారని, గత కాంగ్రెస్ ప్రభుత్వంలో నిర్మించిన నాగార్జునసాగర్, తుంగభద్ర, నిజాంసాగర్ తదితర ప్రాజెక్టులు నేటికీ చెక్కు చెదరలేదని, కానీ కాళేశ్వరం ప్రాజెక్టుకు అప్పుడే పగుళ్లు ఏర్పడ్డాయని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ పదేళ్లలో చేయని అభివృద్ధిని కాంగ్రెస్ పార్టీ కేవలం 9 నెలల్లోనే చేసి చూపించిందన్నారు. దీనిపై చర్చించేందుకు మాజీమంత్రి హరీశ్‌రావు సిద్ధమేనా అని సవాల్ విసిరారు. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి పెద్ద ఎత్తున వలసలు ఉండబోతున్నాయని తెలిపారు. ఆ పార్టీలో తండ్రి, కూతరు, కొడుకు తప్ప అల్లుడు కూడా ఉండే పరిస్థితి లేదని జోస్యం చెప్పారు. ఇటీవలే జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ భవిష్యత్ అర్థమైందని, త్వరలోనే ఆ పార్టీది ముగిసిన చరిత్ర అని విమర్శించారు. పథకాల అమలు కోసం ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా..ఎలాంటి హంగులు, ఆర్భాటాలకు వెళ్లకుండా ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. టీపీసీసీ అంటేనే కాంగ్రెస్ కార్యకర్తల ప్రతినిధి అని, కార్యకర్తల శ్రేయస్సు కోసం పని చేస్తానని తెలిపారు. జనవరిలో కార్యకర్తలకు పండుగ రాబోతుందని, కార్యకర్తలంతా ఉత్సాహంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పాల్గొని జిల్లాలో అన్ని సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీలు, జెడ్పీచైర్మన్, డీసీసీబీ చైర్మన్ పదవులను కైవసం చేసుకుని జిల్లాను కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేయాలని పిలుపునిచ్చారు.

పదేళ్లలో ఆగమైన తెలంగాణ

మంత్రి దామోదర రాజనర్సింహ

60 ఏళ్ల ఆకాంక్ష, విద్యార్థుల ఆత్మబలిదానాలను గుర్తించి సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రం ఇస్తే నూతనంగా ఏర్పడిన తెలంగాణ కేవలం ఒక కుటుంబానికి బందీగా మారిందన్నారు. గత పదేళ్లలో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు నిరంకుశ, కుటుంబ పాలన, అవమానాలను ధీటుగా ఎదుర్కొని కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారన్నారు. కార్యకర్తలు లేనిదే పార్టీ లేదని, వారే తమ పార్టీకి పట్టుకొమ్మలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఆరు గ్యారంటీలలో భాగంగా ఇప్పటికే మహిళలకు ఉచిత ప్రయాణం, గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల ద్వారా ఉచిత విద్యుత్, రూ.500లకే సిలిండర్, రెండు లక్షల రుణమాఫీ వంటి పథకాలను అమలు చేసిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జగ్గారెడ్డి, చంద్రశేఖర్, నాయకులు నీలం మధు, ఉజ్వల్‌రెడ్డి, గాలి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ తదితరులు

- అదనపు కలెక్టర్ చంద్రశేఖర్
- ప్రజావాణిలో 42 దరఖాస్తుల స్వీకరణ

సంగారెడ్డి జోన్: ప్రజావాణిలో భాగంగా వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 42 ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్‌తోపాటు డీఆర్‌వో పద్మజారాణికి అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పొలాలకు వెళ్లేందుకు రోడ్డు నిర్మించాలి



గ్రామ శివారులోని వైకుంఠ గ్రామంతోపాటు రైతుల పంట పొలాలకు వెళ్లేందుకు మట్టి రోడ్డుతో ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాలు కురిసిన సమయంలో పూర్తిగా బురదమయంగా మారుతుంది. అధికారులు చర్యలు తీసుకుని రహదారి కోసం మరమ్మతులు చేపట్టాలి.

-పొట్టిపల్లి గ్రామం, సదాశివపేట మండలం. గ్రామస్తులు

స్థలంతోపాటు ఇల్లు మంజూరు చేయాలి




నా భర్త లక్ష్మణ్ నాయక్ గత రెండేళ్లుగా పక్షవాతం వ్యాధితో బాధపడుతూ ఎలాంటి పనులు చేయలేక పోతున్నాడు. నా భర్తను చూసుకునేందుకు ఇంటిదగ్గరే ఉంటున్నాను. దీంతో పూట గడవటం కష్టంగా ఉంది. తండాలో చిన్నపాటి రేకుల షెడ్డులో ఉంటున్నాం. అధికారులు చర్యలు తీసుకుని ఇంటిస్థలంతోపాటు ఇల్లు నిర్మాణానికి ఆర్థిక సాయం చేయాలి.

-లక్ష్మీబాయి, లక్ష్మణ్ నాయక్, మంచిర్యాల తండా, వట్‌పల్లి.

మరుగుదొడ్డి తప్పనిసరి

అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తదితరులు

సంగారెడ్డి జోన్: గ్రామాలలో ప్రతీ ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్డి తప్పనిసరని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం–2024 సందర్భంగా సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో ‘మరుగుదొడ్డి– మన ఆత్మ గౌరవం’ అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఈ నెల 19 నుంచి డిసెంబర్ 10 వరకు జిల్లాలోని అన్ని గ్రామాలను ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ (ఓడీఎఫ్) ప్లస్ గ్రామాలుగా మార్చేందుకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నామన్నారు. గ్రామాలలో మరుగుదొడ్లు లేని కుటుంబాలను గుర్తించి వాటి నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని సూచించారు.

క్లుప్తంగా

పీడీఎస్ బియ్యం పట్టివేత



పోలీసులు పట్టుకున్న బియ్యం

మద్దూరు(హుస్నాబాద్): ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఏఎస్ఐ విజయ్‌కుమార్.. మండలంలోని వల్లంపట్ల గ్రామానికి చెందిన గౌరిశెట్టి విశ్వనాథం ఇంట్లో అక్రమంగా బియ్యాన్ని నిల్వ ఉంచాడు. సోమవారం నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేయగా 7.74 క్వింటాళ్ల లభ్యమయ్యాయి. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. వల్లంపట్ల గ్రామంలో తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఎక్కువ ధరకు ఇతర ప్రాంతాలకు అమ్ముతున్నాడని తెలిపారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థి భరత్

దుబ్బాకటౌన్: రాష్ట్ర స్థాయి అండర్–19 వాలీబాల్ పోటీలకు రాయపోల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి గుంటుకు భరత్ ఎంపికయ్యాడని పాఠశాల పీడీ గోవర్ధన్ రెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో గజ్వేల్ బాలికల ఎడ్యుకేషన్ హబ్ లో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా అండర్–19 బాలుర వాలీబాల్ పోటీల్లో భరత్ ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. ఈనెల చివరి వారంలో మహబూబ్‌నగర్ జిల్లా నారాయణ్ పేట్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో భరత్ పాల్గొంటాడని సూచించారు.

108లో మతి స్థిమితం లేని మహిళ ప్రసవం

పటాన్‌చెరు టౌన్: మతి స్థిమితం లేని ఓ మహిళ 108లో ప్రసవమై పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈ సంఘటన పటాన్‌చెరు పారిశ్రామిక వాడలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. 108 టెక్నీషియన్ ఏవీ రెడ్డి, పైలెట్ శ్రీధర్ కథనం మేరకు.. మండలంలోని ముత్తంగి డీఎన్ కాలనీలో గుర్తు తెలియని మతి స్థిమితం లేని ఓ మహిళ పురిటి నొప్పులతో కిందపడి ఉండగా కాలనీకి చెందిన మహిళలు చూసి 108కి సమాచారం ఇచ్చారు. సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే లోపే పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నట్లు ఏవీ రెడ్డి తెలిపారు.

కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి


మల్టీ పర్పస్ వర్క్ విధానం రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

కొండాపూర్(సంగారెడ్డి): గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ బాబూరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రమైన కొండాపూర్‌లోని మండల పరిషత్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ.. మూడు నెలలుగా కార్మికులకు వేతనాలు పెండింగ్‌లో ఉండడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పటికీ స్థానికంగా స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు సకాలంలో వేతనాలు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. అలాగే మల్టీపర్పస్ వర్క్ విధానం రద్దు చేసి కార్మికులకు పని భారం తగ్గించాలని కోరారు. ఈఎస్ఐ, పీఎఫ్, ఆరోగ్య బీమా వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సంజీవులు, వెంకయ్య, నాయకులు రాజు విజేందర్, సత్యమ్మ, సుశీల, కవిత, రవి, అనంతయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు తగిలి డీసీఎంలో గడ్డి దగ్ధం



శివ్వంపేట(నర్సాపూర్): గడ్డిలోడుతో వెళ్తున్న డీసీఎం వాహనానికి విద్యుత్ తీగలు తగిలి అందులోని గడ్డి పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటన మండల పరిధిలోని రత్నాపూర్ గ్రామ శివారులో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రత్నాపూర్‌లో సేకరించిన గడ్డిని (ఎండు పశుగ్రాసం) డీసీఎం వాహనంలో లోడ్ చేసి పాంబండకు తరలిస్తుండగా వ్యవసాయ పొలాల వద్ద కిందికి వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగిలి మంటలు అంటుకున్నాయి. మంటల్ని గుర్తించిన డ్రైవర్ చాకచక్యంగా డీసీఎం వాహనాన్ని దగ్గరలోని అమ్రాడి చెరువులోకి తీసుకెళ్లి వాహనం మంటల్లో చిక్కుకోకుండా రక్షించుకున్నాడు.

చలి కాలం.. పౌల్ట్రీ పదిలం

- ఉష్ణోగ్రతలు తగ్గితే కోడి పిల్లలు చనిపోయే అవకాశం
- కోళ్ల పెంపకంలో జాగ్రత్తలు తప్పనిసరి
- ముందస్తు చర్యలతో యజమానులకు మేలు
- పశువైద్యుల సలహాలు సూచనలు పాటించాలి



దుబ్బాకటౌన్: జిల్లాలో రైతులు వ్యవసాయంతో పాటు పౌల్ట్రీ రంగాన్ని ఎంచుకొని ఆదాయం పొందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 2,350 ఫౌల్ట్రీ ఫామ్‌లు ఉన్నాయి. పౌల్ట్రీ రంగానికి చలి కాలంలో సహజంగా ఇబ్బందులు ఎదురవుతాయి. సమస్యలను అధిగమించే అంశాలపై దుబ్బాక ప్రాంతీయ పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్, పశు వైద్యాధికారి బాలసుందరం సలహాలు సూచనలు అందించారు.

- సాధారణంగా కోడి శరీర ఉష్ణోగ్రత 107 ఫారన్ హీట్ డిగ్రీలు ఉంటున్నందున వాతావరణ ఉష్ణోగ్రత 55 ఫారన్ హీట్‌కు తగ్గడంతో చిన్న కోడి పిల్లలు చలికి చనిపోయే ప్రమాదం ఉంది. బ్రూడింగ్ ఉష్ణోగ్రత లోపం వల్ల కూడా కోడి పిల్లలో దుష్ప్రభావం ఉంటుంది. చలి ప్రభావంతో కోళ్లలో నిర్దిష్ట సమయంలో అధిక గుడ్ల ఉత్పత్తి కష్టమవుతుంది.
- కోళ్ల చలిగాలులకు గురికాకుండా ఉదయం 11 వరకు సాయంత్రం 4 గంటల వరకు పరదాలు కట్టాలి. ఈ సమయంలో ఉత్పత్తి తగ్గకుండా లైటింగ్ 16 గంటల పాటు ఏర్పాటు చేయాలి.
- షెడ్ల చుట్టూ 10 అడుగుల దూరం వరకు పిచ్చి మొక్కలు, పొదలు తొలగించాలి.
- కోళ్ల షెడ్డులు 100 అడుగుల కంటే ఎక్కువ పొడవుగా ఉంటే మేలు. ఉష్ణోగ్రత అలాగే ఉండడానికి గాలి ప్రసరణకు తాత్కాలికంగా షెడ్డులోనే భాగాలుగా చేసి కోళ్లను వేయాలి.
- కోడి పిల్లలను కిక్కిరిసి ఉంచితే శ్వాస కోశ సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. కావున సరిపోయే స్థలం కేటాయించాలి. కోడి పిల్లల వయస్సును బట్టి 0.25–0.50 చదరపు అడుగులు లేయర్స్‌కు, 1 చదరపు అడుగు బాయిలర్స్‌కు స్థలం కేటాయించాలి.

లిట్టర్ నిర్వహణ

- లిట్టర్‌లో సాధారణంగా ఉండే తేమ 20–30 శాతం. చలికాలం కాలం ఆవిరి కావడం తక్కువగా ఉంటున్నందున తేమ అలాగే ఉండిపోయి లిట్టర్ గట్టి పడుతుంది. దీంతో ఈ–కొలై వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి లిట్టర్‌లో ప్రతీ 100 చదరపు అడుగుల స్థలానికి 5 నుంచి 8 కిలోల పొడి సున్నం లేదా అమ్మోనియం సల్ఫేట్ లేదా 6 కిలోల సూపర్ పాస్ఫేట్ కలపాలి.
- లిట్టర్‌ను తరుచూ కదిలిస్తూ పొడిగా ఉండేలా చూడాలి.
- చలి వాతావరణంలో కోళ్లు ఎక్కువ మేత, నీళ్లు తాగి పలుచటి రెట్ట వేస్తాయి. తర్వాత లిట్టర్ తడిగా ఉంటుంది. దీంతో అమ్మోనియా శాతం పెరుగుతుంది. కాబట్టి తడి లిట్టర్‌ను తొలగిస్తూ ఉండాలి.

బ్రూడింగ్ విషయంలో ..

- చలికాలంలో బ్రూడింగ్ నిర్వహణలో అత్యంత శ్రద్ధ వహించాలి. కోడి పిల్లలు మొదటి వారంలో 90–95 శాతం ఫారన్ హీట్ డిగ్రీలు ఆ తర్వాత ప్రతీ వారానికి 5 ఫారన్ హీట్ డిగ్రీల చొప్పున తగ్గిస్తూ ఆరో వారానికి 70 ఫారన్ హీట్ డిగ్రీలు ఉండేలా చూసుకోవాలి.
- కేజ్ సిస్టమ్‌లో అయితే బ్రూడింగ్ షెడ్ ఉష్ణోగ్రత 85 ఫారన్ హీట్ డిగ్రీల తేమ 25 శాతం ఉండే విధంగా చూడాలి. ఉష్ణోగ్రత క్రమ క్రమంగా 70 శాతం చేరే వరకు చూడాలి.

ఎక్కువ మోతాదులో దాణా..



శరీర ఉష్ణోగ్రత కాపాడుకోవడానికి చలి కాలంలో కోళ్ల దాణా ఎక్కువగా తీసుకుంటాయి. 21.1 సెంటిగ్రేడ్ డిగ్రీల కంటే 1 సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత తగ్గితే మేత వినియోగం 1.5 శాతం పెరుగుతుంది. మేత ఎక్కువగా తీసుకుంటున్నాయని దాణా తగ్గిస్తే ఉత్పత్తి తగ్గుతుంది. కాబట్టి దాణా తగ్గించకుండా పోషకాలను సరి చేయాలి. దాణా ముడి పదార్థాలు, నిల్వ సందర్భంలో తేమ, వర్షపు జల్లుల బారిన పడితే శిలీంద్రాలు వృద్ధి అవుతాయి. తేమ 9 శాతం కంటే మించితే అఫ్లోటాక్సిన్ సమస్య ఏర్పడుతుంది. ఈ సమస్య నివారణకు దాణాలో ఈస్ట్ కల్చర్‌ను టన్ను దాణాకు 1 కిలో చొప్పున, టాక్సిన్ బైండర్స్ 2 కిలోల చొప్పున కలిపి అంధించాలి.

ప్రత్యేక శ్రద్ధ వహించాలి



చలి కాలంలో పౌల్ట్రీ ఫామ్‌లో నష్టాలు వాటిల్లకుండా రైతులు రక్షణ చర్యలు తప్పక పాటించాలి. కోళ్ల పెంపకం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఏవైనా సమస్యలు ఎదురైతే పశువైద్యాధికారులను సంప్రదించాలి.

– బాలసుందరం, దుబ్బాక ప్రాంతీయ పశు వైద్యశాల పశువైద్యాధికారి

ఖమ్మంపల్లిలో పులి అడుగు జాడలు



పులి అడుగుల ఆనవాళ్లు



రైతులతో మాట్లాడుతున్న ఫారెస్ట్ అధికారులు

- భయాందోళనలో గ్రామస్తులు
- పరిశీలించిన ఫారెస్ట్ అధికారులు

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలంలోని ఖమ్మంపల్లి గ్రామ వ్యవసాయ బావుల వద్ద పులి అడుగుల ఆనవాళ్లు కనిపించడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్దసాయిగారి మల్లయ్య సోమవారం ఉదయం వ్యవసాయ బావి వద్ద పాడి గేదెలకు పాలు పితకడానికి వెళ్లాడు. దారిలో ఉన్న రైతు తోల్ల మల్లయ్య బావి వద్ద పులి అడుగుల ఆనవాళ్లను చూసి భయాందోళనకు గురై వెంటనే గ్రామస్తులకు చెప్పాడు. గ్రామస్తులు వెళ్లి కొద్ది దూరం వరకు పులి అడుగుల ఆనవాళ్లు ఉన్నట్లు గుర్తించి అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఫారెస్ట్ అధికారులు ఇక్రమొద్దీన్, పద్మలతోపాటు సిబ్బంది వెళ్లి పులి అడుగులను పరిశీలించారు. ఈ ప్రాంతంలో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసి పులి సంతచిరించిందా లేదా మరేదన్న జంతువు సంచరించిదా అన్న విషయాన్ని గుర్తిస్తామంటూ రైతులతో మాట్లాడారు. రాత్రి పూట వ్యవసాయ బావుల వద్దకు వెళ్లేటప్పుడు ఒకరు కాకుండా ముగ్గురు నలుగురు కలిసి వెళ్లాలని, టార్చిలైట్‌ను వెంట తీసుకెళ్లాలని అధికారులు సూచించారు. ఈ ప్రాంతంలో సీసీ కెమెరాలతోపాటు ప్రత్యేక బోన్లను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో రైతులు, ఫారెస్టు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ ఏర్పాటులో నిర్లక్ష్యం వీడాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి



ర్యాలీగా తీస్తున్న సీపీఎం నాయకులు

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూళ్మిట్ట మండలాలన్నీ కలిపి చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో పాత బస్టాండ్ నుంచి అంగడి బజార్ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఎనిమిదేళ్లుగా చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోరుతూ ప్రజలు, సీపీఎం అనేక ఉద్యమాలు చేసినా పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో డివిజన్ ఏర్పాటు ఆలస్యమవుతుందన్నారు. గత ఎన్నికలకు ముందు ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి జనగామ ఎన్నికల ప్రచార సభలో మేం అధికారంలోకి రాగానే చేర్యాల రెవెన్యూ డివిజన్ ప్రకటిస్తామని హామీ ఇచ్చారన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గతంలో ప్రతిపక్ష పార్టీ ఎంపీగా చేర్యాల రెవెన్యూ డివిజన్ పోరాటంలో సంఘీభావం తెలియజేసిన విషయం గుర్తు చేశారు. కానీ నేడు అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఎవరూ డివిజన్ ఏర్పాటు అంశం పట్టించుకోవడం లేదని విమర్శించారు. వెంటనే చేర్యాల రెవెన్యూ డివిజన్ ప్రకటన చేయాలని లేని పక్షంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సత్తిరెడ్డి, వెంకట్‌మావో, కృష్ణారెడ్డి, శారద, ప్రశాంత్, అరుణ్ కుమార్, రవీందర్, నాగరాజు, కనకయ్య, కుమార్, ఇంద్రం, ఇస్తారి, మల్లేశం, బాలస్వామి, చక్రపాణి, భరత్, శ్రీహరి, నర్సిరెడ్డి, ప్రభాకర్, శోభ, అశోక్, అస్గర్, రంజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన 'ఫైనాన్స్'

- వ్యాపారుల వేధింపులు తాళలేక ఆత్మహత్య
- చెరువులో దూకిన కిరాణాషాపు యజమాని



నర్సింలు (ఫైల్)

జోగిపేట(అందోల్): డెయిలీ ఫైనాన్స్ వ్యాపారుల వేధింపులు తాళలేక కిరాణా షాపు యజమాని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జోగిపేట పట్టణ కేంద్రంలో సోమవారం వెలుగులోకి వచ్చింది.ఎస్సై 2 మొగులయ్య కథనం మేరకు.. పట్టణానికి చెందిన సరూప్ నర్సింలు (48) కొన్నేళ్లుగా స్థానికంగా కిరాణా షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ మధ్యకాలంలో డెయిలీ ఫైనాన్స్ వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి అప్పులు చేశాడు. దీనికిగాను నిత్యం డబ్బులు చెల్లించాలి. డబ్బులు సమయానికి ఇవ్వకపోవడంతో ఫైనాన్స్ వ్యాపారులు ఫోన్లు చేసి డబ్బులు అడిగేవారు. ఆదివారం సాయంత్రం నర్సింలు ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం అన్నాసాగర్ చెరువులో మృతదేహం తేలడంతో స్థానికులు గుర్తించి పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఫైనాన్స్ వ్యాపారుల వేధింపులు తాళలేక తన భర్త చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

పాపన్నపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని యూసుఫ్‌పేట శివారులో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పాపన్నపేట ఏఎస్ఐ సంగన్న కథనం మేరకు.. కొత్తపల్లి గ్రామానికి చెందిన బైండ్ల యశ్వంత్(19) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం అదే గ్రామానికి చెందిన మిత్రుడు ఉమామహేశ్వర్‌తో కలిసి పాపన్నపేటకు బైక్‌పై వెళ్లాడు. అనంతరం తిరిగి వస్తుండగా యూసుఫ్‌పేట శివారులోకి రాగానే బైక్ అదుపుతప్పి కింద పడిపోయారు. ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ యశ్వంత్ మృతి చెందాడు. మృతుడి తండ్రి దుర్గయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

గంటల వ్యవధిలో ఒకే చోట రెండు ప్రమాదాలు

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్–మెదక్ జాతీయ రహదారిపై కొన్ని గంటల వ్యవధిలోనే ఒకే చోట రెండు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. నర్సాపూర్‌కు చెందిన సంజయ్ అనే యువకుడు బైక్ పై కొడిపల్లి మండలం తిమ్మాపూర్‌కు అంత్యక్రియలకు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సంజయ్‌కి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అదే చోట కొన్ని గంటల వ్యవధిలోనే మరో ప్రమాదం జరిగింది. కొడిపల్లి మండలం కుషన్ గట్టు తండాకు చెందిన సికిందర్ బైక్‌పై నర్సాపూర్ వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. సికిందర్‌కు తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు.



గాయాలతో సికిందర్

రైల్వే పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి..

రామచంద్రాపురం (పటాన్‌చెరు): రైలు పట్టాలపై ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసుల కథనం మేరకు.. తెల్లాపూర్, లింగంపల్లి రైల్వే స్టేషన్ మధ్యలోనే రైల్వే పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు రైల్వే పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించగా మృతి చెందిన వ్యక్తి వయస్సు 35 నుంచి 45 ఏళ్ల మధ్యలో ఉంటుందని తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని పేర్కొన్నారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతి చెందిన వ్యక్తిని ఎవరైనా గుర్తిస్తే వెంటనే వికారాబాద్ రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.



పార్కులో జర్మనీ దేశ పౌరులు

వావ్.. బ్యూటీఫుల్

డైనోసార్ పార్క్‌ను తిలకించిన జర్మనీ పౌరులు

సిద్దిపేటజోన్: సిద్దిపేట కోమటిచెరువు వద్ద పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డైనోసార్ పార్క్‌ను సోమవారం జర్మనీ దేశ పౌరులు సందర్శించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తున్న వారు హైదరాబాద్ నుంచి సిద్దిపేట కోమటి చెరువు కు వచ్చారు. డైనోసార్ పార్క్ చాలా బాగుందని, కోమటిచెరువు సుందరంగా ఉందని కితాబిచ్చారు.

భూ నిర్వాసితుల తాగు నీటికి నిధులు



ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ చేసి ప్రారంభిస్తున్న డీఈ రహీన

హుస్నాబాద్‌రూరల్: గౌరవెల్లి ప్రాజెక్టు భూ నిర్వాసితులు కొందరు కూచనపెల్లి గ్రామంలో భూములు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నారు. ఈ కాలనీలో తాగునీటి కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.36 లక్షలు మంజూరు చేశారు. దీంతో కాలనీలో రూ.18 లక్షల వ్యయంతో వాటర్ ట్యాంక్ నిర్మాణం, మరో రూ.18లక్షల వ్యయంతో పైపులైన్ నిర్మాణాలకు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రహీన సోమవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బంక చందు, నాయకులు యాదవరెడ్డి, మామిడి రాజు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

న్యాల్‌కల్ మండలంలో ఘటన



కల్లప్ప (ఫైల్)

న్యాల్‌కల్(జహీరాబాద్): అప్పుల బాధతో గడ్డి మందు తాగి రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన న్యాల్‌కల్ మండలంలో చోటు చేసుకుంది. జహీరాబాద్ రూరల్ సీఐ బిడెకన్నె హన్మంత్ కథనం ప్రకారం.. కల్బెమల్ గ్రామానికి చెందిన ఒగ్గు కల్లప్ప(61) అనే రైతు తనకున్న మూడెకరాల పొలంలో వివిధ పంటలను సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అప్పులు చేసి గతేడాది పొలంలో బోరు వేయించాడు. అది నీరుపడకపోవడంతో మరో బోరు వేయించాడు. అలాగే, పొలంలో చెరకు, సోయా పంటలను సాగు చేశాడు. 16న (శనివారం) సోయా పంటను బీదర్‌కు తీసుకెళ్లి విక్రయించి చెరకు తోటలో పెరిగిన గడ్డిని తొలగించేందుకు గడ్డి మందును తీసుకొచ్చాడు. అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురై అదే రోజు రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్త బీదర్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు మల్లేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వెలుగులోకి ఉపాధి హామీ అక్రమాలు



సామాజిక తనిఖీలో విచారణ చేపడుతున్న అధికారులు

- ముగ్గురు ఎఫ్ఎల సస్పెండ్
- రూ.3,90,516 రికవరీకి ఆదేశం

పెద్దశంకరంపేట(మెదక్): ఉపాధి హామీ పనుల్లో జరిగిన అక్రమాలు సామాజిక తనిఖీల్లో వెలుగు చూశాయి. సోమవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సామాజిక తనిఖీలో 2023–24లో జరిగిన ఉపాధిహామీ పనుల్లో రూ.5,48,71,793 పనులను మండలంలోని 27 గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహించారు. ఇందులో గొట్టిముక్కుల, చీలాపల్లి, బద్దారం గ్రామాల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయి. ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్‌లను సస్పెండ్ చేస్తున్నట్లు ఇన్‌చార్జి అడిషనల్ డీఆర్‌డీఏ ఏపీడీ రంగాచార్యులు తెలిపారు. ఆయా గ్రామాల్లో రూ.3,90,516 రికవరీకి ఆదేశించామని, ఇందులో రూ.63,600 ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఈజీఎస్ సిబ్బందికి ఫైన్ విధించినట్లు ఏపీడీ తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో విజిలెన్స్ జిల్లా అధికారి శ్రీహరి, హెచ్‌ఆర్ రాజేందర్‌రెడ్డి, క్యూసీ జ్యోతి, జేఆర్‌సీ అరుణ, ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా, ఏపీఓ నవాజుద్దీన్, ఎస్ఆర్‌పీ జీవన్, టీఎలు, ఎఫ్ఎలు తదితరులున్నారు.

రహదారే.. జీవనాధారం

పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట రాజస్థాన్, ఒరిస్సా, మహారాష్ట్రకు చెందిన కొన్ని కుటుంబాలు వంట పాత్రలు, ఇనుప కత్తులు, వివిధ రకాల పని ముట్లను తయారు చేసి అమ్ముకుంటున్నారు. వీరు దాదాపు రెండు, మూడు నెలలు వలస జీవనం చేస్తూ తిరుగుతుంటారు. సిద్దిపేట పట్టణ వీధుల్లో కనిపించిన దృశ్యాలను సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట





పేదల బతుకులు బుగ్గిపాలు



కాలి బూడిదైన సామగ్రి

వెల్దుర్తి(తూప్రాన్): విద్యుదాఘాతంతో పూరి గుడిసె దగ్ధమైన ఘటన మండల పరిధిలోని చర్లపల్లి తండాలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తండాకు చెందిన కేతావత్ గోపాల్ కుటుంబ సభ్యులతో కలిసి పూరి గుడిసెలో నివాసం ఉంటున్నాడు. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి గుడిసె అంటుకోవడంతో కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో గుడిసెలోని రూ.20 వేలు, సేవాలాల్ మహారాజ్ ఆలయ వార్షికోత్సవం కోసం తీసుకొచ్చిన రూ.30 వేల విలువైన సామగ్రి, నిత్యావసర సరుకులు, వంట సామగ్రి, దుస్తులు అగ్నికి ఆహుతి అయ్యాయి. ప్రభుత్వమే తమని ఆదుకోవాలని బాధితుడు గోపాల్ విజ్ఞప్తి చేశాడు.

రూ. 2 లక్షల ఆస్తి నష్టం

తొగుట(దుబ్బాక): ప్రమాదవశాత్తు పూరి గుడిసె దగ్ధమైన ఘటన మండల పరిధిలోని ఘణపూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన బచ్చలి కనకవ్వ కూలీ పనులు చేసుకుంటూ పూరి గుడిసెలో నివాసం ఉంటుంది. ఒంటరిగా ఉంటున్న కనకవ్వ రాత్రి పూట పూరి గుడిసెలో కాకుండా పక్కవారి ఇంట్లో నిద్రిస్తూ ఉంటుంది. ఆదివారం రాత్రి గుడిసెలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయి. ఇరుగు పొరుగు వారు గమనించి మంటలను ఆర్పివేయడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ఈ ప్రమాదంలో 30 తులాల వెండి, తులం బంగారం, బియ్యంతో పాటు, నిత్యావసర సరుకులు, బట్టలు, రూ. 30 వేల నగదు కాలి బూడిదయ్యాయి. ప్రమాదంలో సుమారు రూ. 2 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితురాలు కన్నీటి పర్యంతమైంది.

విద్యుదాఘాతంతో రెండు పూరి గుడిసెలు దగ్ధం



పూరి గుడిసె వద్ద బాధితులు